క్లుప్తంగా

శానిటరీ సిబ్బందికి దసరా కానుకలు



62వ వార్డులో శానిటరీ సిబ్బందికి దసరా కానుకలు అందిస్తున్న మజ్జి మాలినాయుడు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు శానిటరీ సిబ్బందికి వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు తన సొంత నిధులతో దసరా కానుకలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటరీ సిబ్బంది చేస్తున్న సేవలను మెచ్చి దసరా కానుక అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, రవి, కుమారు, గోవింద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రానికే ముప్పు



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్రం భారీగా నష్టపోతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1340వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువు పట్టువంటి విశాఖ ఉక్కును అమ్మేస్తే రాష్ట్రానికి వెన్నెముక విరిగినట్టే అన్నారు. దసరా పండగకు బోనస్ చెల్లించాల్సిన యాజమాన్యం కనీసం జీతాలు కూడా చెల్లించకుండా మానసికంగా వేధిస్తుందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో బోనస్ చెల్లిస్తే, ఇక్కడ మాత్రం జీతం కూడా చెల్లించకుండా కావాలనే కార్మికులను, వారి కుటుంబ సభ్యులను వేధిస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు కామేశ్వరరావు, డేవిడ్, విల్లా రామ్మోహన్‌కుమార్, బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ సంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పండగ రోజూ తప్పని పాట్లు..!

- అందని దసరా కానుక
- అరకొరగా రేషన్ సరకుల పంపిణీ
- కందిపప్పు, పంచదార కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- సబ్సిడీ సరకుల కోసం రైతుబజార్లలో బారులు



చాలీచాలని కందిపప్పు ప్యాకెట్లు



కాకానినగర్‌లో ఎండీఎం వాహనం వద్ద కందిపప్పు కోసం గుమిగూడిన లబ్ధిదారులు

విశాఖ విద్య: దసరా పండగ వేళ నిత్యావసర సరకుల కొనుగోలుకు ప్రజలు పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. కోడి కూర కమ్మగా వండుకొని తిందామన్నా.. వాటిలో వేసుకునేందుకు ఉల్లిపాయలు, టమాటో దొరకని పరిస్థితి. బయట మార్కెట్‌లో ధరలు చుక్కలనంటుతున్నాయి. కిలో టమాటో రూ.80కు విక్రయిస్తున్నారు. కిలో ఉల్లిపాయలు రూ.70 వరకు ధర పలుకుతోంది. ధరలు నియంత్రించి తక్కువ ధరకే టమాటా, ఉల్లిపాయలను రైతుబజార్లలో విక్రయిస్తున్నామని అధికారులు చెబుతున్నా. వాటి కోసమని లైన్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని మద్రిపాలెం, గోపాలపట్నం, కంచరపాలెం రైతుబజార్లలో ఎక్కడ చూసినా ప్రతి రోజూ ఇవే సన్నివేశాలు కనిపిస్తున్నాయి. సబ్సిడీ టమాటా అంటూ...ఆధార్ కార్డు తెచ్చిన వారికే రైతుబజార్లలో కేవలం రెండు కేజీలు విక్రయించారు. పండగ రోజుల్లో కూడా ఇలాంటి ఇబ్బందులు ఎన్నటూ చూడలేదని, 'ఇదేనా మంచి ప్రభుత్వం..' అంటూ పాలకుల తీరుపై సామాన్య ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కందిపప్పు ఊసే లేదు

ప్రతి ఏటా దసరాకు ముందు ఇచ్చే రేషన్ సరకులు సైతం ఈ ఏడాది లబ్ధిదారులకు సవ్యంగా అందలేదు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సబ్సిడీపై ఒక కేజీ కందిపప్పు, కేజీ పంచదార పంపిణీ చేస్తున్నామని అధికారులు ప్రకటించారు. గోపాలపట్నం మండలంలో ఇది అమలుకు నోచుకోలేదు. జీవీఎంసీ 90వ వార్డులోని కాకానినగర్, బుచ్చిరాజుపాలెం, విమాన్‌నగర్, 57వ వార్డులోని సాకేతపురం వంటి చోట్ల లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేయలేదు. ఎండీఎం వాహనాలు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తూనే.. పండగ గడిపేయాల్సి వచ్చిందని కాకానినగర్‌కు చెందిన సుగుణమ్మ అనే లబ్ధిదారు తెలిపింది. కాకానినగర్ ఏరియా ఎండీఎం వాహనానికి 1,850 కేజీల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉండగా.. దసరా పండగ రోజు వరకు 480 కేజీలు మాత్రమే వచ్చాయని, లబ్ధిదారులందరికీ ఇవ్వలేని పరిస్థితి ఉందని ఎండీఎం వాహన నిర్వాహకుడు తెలిపాడు.

పట్టించుకునే వారేరీ..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం, కందిపప్పు, పంచదార వంటి నిత్యావసర సరకులు ఎండీఎం వాహనం ద్వారా ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇళ్ల వద్దే పంపిణీ జరిగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేషన్ సరకుల కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. పండగ వేళల్లో కూడా రేషన్ సరకుల్లో కోత విధించడంపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం మండలంలో ఎంతమందికి రేషన్ కార్డులు ఉన్నాయి? వారందరికీ సవ్యంగా రేషన్ సరుకులు అందుతున్నాయా? లేదా అనేదానిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండటం లేదు. సివిల్ సప్లై అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో లబ్ధిదారులకు ప్రస్తుతం రేషన్ సరకులు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది.



రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా కోసం క్యూలో వినియోగదారులు

అటో.. ఇటో

మితిమీరిన లోడ్‌తో వాహనాల ప్రయాణం



మితిమీరిన లోడుతో వెళుతున్న మినీ వ్యాన్

మల్కాపురం: పలువురు వాహనదారులు పరిమితికి మించి లోడ్లు వేస్తూ ప్రయాణించడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారు భయపడుతున్నారు. ఏ మాత్రం పట్టుతప్పినా పెను ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి

పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 50 వరకు మినీ వ్యాన్లు ఉన్నాయి.వీరు స్క్రాప్,ప్లాస్టిక్ వ్యర్థాలు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి సేకరించి మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని స్క్రాప్ దుకాణాల వద్దకు తీసుకువస్తుంటారు. అయితే వీటిలో పరిమితితో కూడిన లోడ్లు వేయాలి. కానీ వ్యాన్ డ్రైవర్లు ఆ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. పరిమితికి మించి లోడ్ వేయడంతో వ్యాన్లు ఓ వైపు ఒరిగి పోవడం,మరికొన్ని రోడ్డు మధ్యలో నిలిచిపోవడం వంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. స్క్రాప్ దుకాణాల నిర్వాహకులు వాహనాల్లో పరిమితికి మించి లోడ్లు వేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోక పోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు వారు ఆ వ్యాన్లలో ఏ సామగ్రి తరలిస్తున్నారో కూడా అధికారులు తనిఖీలు కూడా చేయడం లేదు.

ఘనంగా ధ్యాన మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో బాబా విగ్రహం



ధ్యాన మందిరంలో భక్తులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 3న గురువారం నుంచి ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు దసరా రోజున ముగిశాయి. రోజూ ప్రత్యేక కార్యక్రమాలు, కుంజుర మహా గణపతి అభిషేకం, బాబాకి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్రనామార్చన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, అనంతరం వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, హోమం వంటివి నిర్వహించారు. దసరా రోజున బాబా 106వ మహా సమాధి (పుణ్యతిథి) సందర్భంగా దీపారాధన, భక్తుల స్వహస్తాలతో విభూది అభిషేకం, మహా అన్నదానం నిర్వహించారు. కాశీ, హరిద్వార నుంచి తెచ్చిన పంచముఖి రుద్రాక్షలతో స్వామిని అభిషేకించారు. అనంతరం రుద్రాక్షలు, కంకణాలు, బాబా ఫొటో, షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది భక్తులకు అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఏఆర్ కార్యాలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న అనకాపల్లి ఎస్పీ దీపిక

ఆరిలోవ: శాంతిభద్రతల పరిరక్షణకు దృఢ సంకల్పంతో కృషి చేయాలని పోలీసులకు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక సూచించారు. విజయదశమి సందర్భంగా శనివారం విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు ఆయుధ పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె జిల్లా పోలీస్ అధికారులతో కలిసి దుర్గాదేవికి పూజలు చేశారు. అనంతరం సిబ్బంది వారు ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు నిరంతరం కష్టపడుతున్నారన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ వ్యవస్థలో ఆయుధాలు ఒక భాగన్నామని, వాటిని అందరూ గౌరవించాలని కోరారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు బాలసూర్యారావు, సతీష్, మన్మధరావు, నర్సింహమూర్తి, ఎస్ఐలు నాయుడు, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- అంబరాన్ని అంటిన సంబరాలు
- కోలాహలంగా అనుపు మహోత్సవం



కాకానినగర్‌లో అమ్మవారి అనుపు ఉత్సవంలో మహిళలు



సాయిమందిరంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా ముగిసాయి. జీవీఎంసీ 52,90వ వార్డుల్లోని శాంతినగర్, కరాస, గౌరీనగర్‌తో పాటు బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, గవరవీధి, కాకాని నగర్ ప్రాంతాల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి విగ్రహాల అనుపు మహోత్సవం కోలాహలంగా సాగింది. కాకానినగర్‌లో అనుపు సంబరం అంబరాన్ని తాకింది. భక్తుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

ముగిసిన దుర్గాదేవి పూజలు

మల్కాపురం: శరన్నవరాత్రి పూజలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు మహిషాసుర మర్దిని రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనం ఇచ్చారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన మండపంలో వైఎస్సార్‌టీయూ నాయకుడు కలిదిండి బద్రీనాథ్,చికెన్ రాజు పాల్గొని అమ్మవారికి పూజలను చేశారు.కార్యక్రమంలో గాజువాక ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ నాయకుడు పి.శంకరావు తదితరులు పాల్గొన్నారు.



మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ

- 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పి.గణబాబు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్,మాత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమాధాధన

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు రాజీవ్‌కాలనీలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని నెలకొల్పి ఉత్సవాలు జరిపించడంసోదరభావానికి, భక్తి భావానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బంటు రామునాయుడు, శరగడం హరి, జయప్రకాష్, రవికిషోర్, శివ, గిరి, నూకఅప్పారావు, ప్రతాప్, రాము, సూరిబాబు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ కాలనీ మండపం వద్ద అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ మహిళలు



వేడుకల్లో పాల్గొన్న సీజీఎం శ్రీధర్, జీఎంలు

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మ సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. దసరా సందర్భంగా జరిగిన సంబరాల్లో తెలంగాణ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు, పిల్లలు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎన్. కుమారస్వామి, జి. ఆనంద్ మాట్లాడుతూ ఏటా బతుకమ్మ సంబరాలు జరుపుతున్నామన్నారు. సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగిశాయన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, జనరల్ మేనేజర్లు రవశేఖర్, డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్, ఎన్. వీరేశం, ఆచారి, ఎ. మురళీధరరెడ్డి, కె.వి.డి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే సాయిబాబా మరణం



సాయిబాబాకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం సాగించిన హింస వల్లే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణించారని విశాఖ పౌర ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం జరిగిన సాయిబాబా సంతాప సభలో పలువరు వక్తలు మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ ప్రొఫెసర్ న్యాయమైన, నూతన సమాజం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని వారు కొనియాడారు. సుదీర్ఘమైన జైలు జీవితం వల్లనే ఆయన ఆరోగ్యం పాడైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన 90 శాతం దివ్యాంగుడు అయినా సరే బెయిల్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో శనివారం సాయిబాబా మరణంతో ప్రజలు నిజమైన పోరాట యోధుడిని కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశాఖ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, ఇఫ్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, బూసి వెంకటరావు, ఎస్.వెంకటలక్ష్మి, ఏడుకొండలు, కేఎస్ చలం, ఎం.పైడిరాజు, జీడీ సారయ్య, రాజు, ఎస్.నాగభూషణరావు, వామనమూర్తి, వి.నల్లయ్య, ఎస్.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు.

రావణుడిపై రాముడి గెలుపే విజయదశమి

- హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తగరపువలస: త్రేతాయుగమున దశానన రావణునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా విజయదశమి జరుపుకొంటారని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస అన్నారు. ఇందుకు ప్రతీకగా ఉత్తరాది రాష్ట్రాలలో విజయదశమి నాడు 'రావణ వధ' నిర్వహిస్తారన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో వైభవంగా జరుపుకొనే ఈ ఉత్సవాన్ని మొదటిసారి విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'రావణవధ' నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అడుగుల ఎత్తు కలిగిన రావణుడి భారీ కటౌట్‌ను ప్రత్యేక బాణసంచాతో దహనం చేశారు. అంబరీష దాస మాట్లాడుతూ చెడుపై మంచి గెలుపే విజయదశమి అన్నారు. అంతకు ముందు నిష్కించిన భక్తదాసచే శ్రీరామ అష్టోత్తర హోమం, శ్రీరామలీలా ప్రవచనం, మహా మంగళ హారతి నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శిల్పారామంలో ముగిసిన సంబరాలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న దసరా సంబరాలు శనివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన నృత్యభారతి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా శాస్త్రీయ నృత్యం ప్రదర్శించి, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కనక మహాలక్ష్మి నృత్య దర్శకత్వంలో కళాకారులు లీలాప్రియ, వేదశ్రీ, నవ్యశ్రీ, సావిత్రి, కుష్మిత తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టానికి పాలకుల తూట్లు



మాట్లాడుతున్న రామ అప్పారావు

అగనంపూడి: సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతి రహిత సమాజాన్ని నిర్మించవచ్చని చేసిన చట్టానికి నేటి పాలకులు తూట్లు పొడున్నారని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ఆరోపించారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తేదీని పురస్కరించుకొని అగనంపూడి సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ అవినీతి బయట పడుతుందనే భయంతో కొంతమంది ప్రజా ప్రతినిధులు, బ్యూరోక్రాట్లు కలిసి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కొన్నేళ్లుగా కృషి చేస్తూ సఫలం అయ్యే స్థితికి తీసుకువెళ్లారన్నారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ కలుగజేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది కొల్లి సత్యారావు, అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షుడు నెల్లి శ్రీనివాసరావు, సీడబ్ల్యూసీ మాజీ కార్యదర్శి వంకర రాము, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడు బలిరెడ్డి శ్రీను, దానబాల త్రిమూర్తులు, దానబాల పైడికొండ, నెల్లి శ్రీను పాల్గొన్నారు.

ఐవీఎల్ శాస్త్రి పేరిట తపాలా స్టాంప్ విడుదల

సీతమ్మధార: సంగీత జనకులం వ్యవస్థాపకుడు ఐ.వి.ఎల్.శాస్త్రి పేరిట రూ.5 విలువ గల తపాలా స్టాంపుని కేంద్ర ప్రభుత్వం ముద్రించడం సంతోషకరమని ఆదాయ పన్ను శాఖ అధికారి వి.నాగ సూర్యారావు అన్నారు. విజయదశమి సందర్భంగా సీతమ్మధారలో శనివారం నిర్వహించిన సంగీతసభలో ఆయన మాట్లాడుతూ ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత ప్రపంచానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కులపతి బుక్ ట్రస్ట్ కార్యదర్శి చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ 20 వేల మందికి శాస్త్రీయ సంగీతంలో ఉచిత శిక్షణ ఇచ్చారని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి చూపిన మార్గంలో సంగీత జనకులం సంస్థ కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

మాంసాహార దుకాణాలు కిటకిట



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా వినియోగదారులతో రద్దీగా మాంసం దుకాణం

సీతమ్మధార : దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకున్నారు. పండగ శనివారం అయినప్పటికీ అసలు హంగామా అంతా ఆదివారమే కనిపించింది. ఉదయం నుంచే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని మాంసం దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసి పోయి కనిపించాయి. సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, బాలయ్య శాస్త్రి లేఅవుట్, గురుద్వారా, నక్కవానిపాలెం, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతాల్లో గల చికెన్, మటన్ దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. నాటుకోళ్ల విక్రయాలు కూడా జోరుగా జరిగాయి.